సాక్షి నల్లగొండ

గురువారం । 2 । మార్చి । 2023



కఠినంగా వ్యవహరించండి
వృద్ధులు, మహిళలపై దాడులకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని రాచకొండ సీపీ ఆదేశించారు. - 8లో



యాజమాన్య పద్ధతులు పాటించాలి
పంటల సాగులో నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలని వాలంతరి డైరెక్టర్ డాక్టర్ బి.కృష్ణారావు అన్నారు. - 10లో

గరిష్టం/కనిష్టం
35°/18°

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రేవంత్‌రెడ్డి పాదయాత్రపై దాడి హేయమైన చర్య



కేతేపల్లిలో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

కేతేపల్లి: భూపాలపల్లిలో టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాదయాత్రపై టీఆర్‌ఎస్ నాయకుల దాడి చేయటం హేయమైన చర్య అని, దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య అన్నారు. బుధవారం కేతేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ప్రజాస్వామ్య వ్యవస్థలో పాదయాత్ర చేసుకునే హక్కు ఎవరికైనా ఉందన్నారు. సీఎం కేసీఆర్ మెప్పు కోసమే స్థానిక ఎమ్మెల్యే గంద్ర వెంకటరమణారెడ్డి దాడి చేయించారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పాలనపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత ప్రారంభమైందని, కేసీఆర్ కుర్చీ కింద బీటలు పడుతుందనే ఆ పార్టీ నాయకులు ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు తిరగబడితే బీఆర్‌ఎస్ తట్టుకోలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో డీసీసీ కార్యదర్శి కోట పుల్లయ్య, కాంగ్రెస్ నాయకులు జటంగి వెంకటనర్సయ్యయాదవ్, కోట శ్రీనివాసరావు, గాజుల శ్రీనివాస్ రాచకొండ లింగయ్య, కర్ణాకర్ పాల్గొన్నారు.

మర్రిగూడ ఎస్‌ఐ వీఆర్‌కు ఎటాచ్

మర్రిగూడ: మర్రిగూడ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న సైదాబాబు వీఆర్‌కు ఎటాచ్ చేశారు. బుధవారం ఎస్పీ అపూర్వరావు ఆదేశాల మేరకు వీఆర్‌కు ఎటాచ్ చేసినట్లు నాంపల్లి సీఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

యాసంగి పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న డీఏఓ

హాలియా : యాసంగి సీజన్‌లో సాగు చేసిన పత్తి పంటలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపడితేనే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారిణి సుచరిత అన్నారు. బుధవారం అనుముల మండలంలోని అంబట్‌పల్లి రెవెన్యూ పరిధిలో రైతులు సాగు చేసిన యాసంగి పత్తి పంటలను ఆమె పరిశీలించి 20 మంది రైతులకు సంబంధించిన వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో పత్తిని సాగు చేసేలా రైతులను ప్రోత్సహించేందుకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని ఏఓలకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి(టెక్నికల్) కీర్తి, అనుముల మండల ఏఓ సంతోషి, ఏఈఓ అభిలాష్ యాదవ్, రైతులు శ్రీనివాస్, శ్రీకాంత్ ఉన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

ఎంజీయూ(నల్లగొండ రూరల్): నేటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని ఓయూ ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. బుధవారం మహాత్మాగాంధీ యూనివర్సిటీలో సైన్స్ అండ్ టెక్నాలజీ, రీసెంట్ ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ అనే అంశంపై నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథి హాజరై మాట్లాడారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ కృష్ణారావు మాట్లాడుతూ మానవ మనుగడకు విజ్ఞాన శాస్త్రాల కృషి వెలకట్టలేనిదన్నారు. నేడు మన ముందు వాతావరణ మార్పులు వ్యవసాయం, ఉపాధి, ఆరోగ్యం విద్య తదితర అంశాలపై మరింత లోతుగా పరిశోధనలు చేసి ఫలితాలు రాబట్టాలన్నారు. ఐఈటీ శాస్త్రవేత్త, వేణుగోపాల్, ఇంధన వనరులపై అవగాహన కల్పించారు. సైన్స్ ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రమేష్, భిక్షమయ్య, జ్యోతి, ప్రశాంతి, రామచందర్‌గౌడ్, మద్దిలేటి, ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.


కాన్పు కోస్తే కోతే!

ప్రైవేట్ ఆస్పత్రుల్లో పెరుగుతున్న ఆపరేషన్లు

- సాధారణ కాన్పులకు ప్రయత్నించని సిబ్బంది
- ఒక్కో సిజేరియన్‌కు రూ.50 వేల నుంచి రూ.70 వేలు వసూలు
- మహిళలకు వచ్చే సైడ్ ఎఫెక్టులను పట్టించుకోని వైద్యులు



గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు కాన్పుల వివరాలు



నల్లగొండ టౌన్: కాన్పు కోసం ప్రైవేట్ ఆస్పత్రులకు వెళితేచాలు కాసులకు కక్కుర్తి పడుతున్న నిర్వాహకులు విచ్చలవిడిగా ఆపరేషన్లు చేసేస్తున్నారు. తల్లిగర్భంలో బిడ్డ అడ్డం తిరిగి అత్యవసరమైతే ఆపరేషన్ చేయాలి తప్ప సాధారణ కాన్పులకే ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం పదేపదే చెబుతున్నా ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. దీంతో జిల్లాలో దాదాపు 50కిపైగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోజురోజుకు పెరుగుతున్న ఆపరేషన్లు ఆందోళన కలిగిస్తున్నాయి. సేవా దృక్పథం అనే భావనే లేకుండా కేవలం ధనార్జనే లక్ష్యంగా ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు సాధారణ కాన్పులు అయ్యే వాటిని ఆపరేషన్లు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

వివిధ సాకులు చెబుతూ..

గర్భిణులకు ఆపరేషన్లు చేసి కాన్పులు చేయడం ద్వారా వారికి భవిష్యత్‌లో వచ్చే సైడ్ ఎఫెక్టులు, అనారోగ్య సమస్యల గురించి వైద్యులు పట్టించుకోవడం లేదు. సంపాదనే ధ్యేయంగా ధనిక, పేద తారతమ్యం లేకుండా పిండం అడ్డం తిరిగింది.. ఉమ్మనీరు తాగింది, పేగు మెడకు వేసుకుంది అనే రకరకాల కారణాలను బూచీగా చూపెడుతూ యథేచ్ఛగా ఆపరేషన్లు చేస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కో ఆపరేషన్‌కు రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. అయినప్పటికీ ప్రైవేట్ దోపిడీని నియంత్రించే వారు లేకుండా పోయారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్‌లో 81.03శాతం ఆపరేషన్లే..

జిల్లాలో గత సంవత్సరం ఏప్రిల్ మాసం నుంచి నేటి వరకు జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో మొత్తం 8,687 డెలివరీలు జరుగగా అందులో సాధారణ కాన్పులు కేవలం 1,627 జరిగాయి. మిగతా 7,060 ఆపరేషన్లే. అంటే ప్రైవేట్ ఆస్పత్రుల్లో 81.3 శాతం ఆపరేషన్లు, కేవలం 19 శాతం సాధారణ కాన్పులు జరగడం కొందరు ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకుల దోపిడీ ధోరణి ఎలా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

ప్రభుత్వ దవాఖానాల్లో..

జిల్లాలోని జీజీహెచ్‌తో పాటుగా మిర్యాలగూడ, దేవరకొండ, సాగర్, నకిరేకల్, మర్రిగూడ ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీల్లో డెలివరీల సంఖ్య రోజూ పెరుగుతోంది. ఏప్రిల్ నుంచి నేటి వరకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో 12,365 కాన్పులు జరిగాయి. అందులో సాధారణ కాన్పులు 41.64 శాతం, సిజేరియన్లు 58.35 శాతంగా జరిగాయని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

నిబంధనలు పాటించకుంటే చర్యలే..



ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆపరేషన్ల సంఖ్య పెరగడం ఆందోళన కలిగిస్తోంది. సాధారణ కాన్పులు పెంచాలని ఆదేశాలను జారీ చేశాం. అత్యవసరమైతేనే ఆపరేషన్ చేయాలి. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించే ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటాం. అవసరమైతే లైసెన్స్‌ను కూడా రద్దు చేస్తాం.

– డాక్టర్ అనిమళ్ల కొండల్‌రావు, డీఎంహెచ్‌ఓ

రేపు చిట్యాల మున్సిపల్ సమస్యలపై 'సాక్షి ఫోన్‌ఇన్'

ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

చిట్యాల మున్సిపాలిటీ పరిధిలో కుక్కలు, కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నారా.. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వీధి దీపాల సమస్యలు ఎదుర్కొంటున్నారా.. అయితే మీ సమస్యలను నేరుగా మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేయండి. మున్సిపల్ కమిషనర్‌తో ఈ నెల 3వ తేది (శుక్రవారం) 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది.

సాక్షి ఫోన్‌ఇన్

ఫోన్ చేయాల్సిన నంబర్ : 93470 16142



మందడి రామదుర్గారెడ్డి, మున్సిపల్ కమిషనర్, చిట్యాల

గ్యాస్ భారం.. రూ.83 లక్షలు

- గృహ అవసరాల సిలిండర్‌పై రూ.50 వడ్డింపు
- జిల్లాలో నెలకు 1,66,322 సిలిండర్ల వాడకం
- గ్యాస్ ధర పెంపుపై రెండు రోజులు బీఆర్‌ఎస్ నిరసనలు
- ఆందోళనలకు పిలుపునిచ్చిన మంత్రి జగదీశ్‌రెడ్డి



నల్లగొండ: వంట గ్యాస్ సిలిండర్ ధర పెరిగింది. కేంద్ర ప్రభుత్వం గృహ అవసరాలకు సంబంధించిన సిలిండర్‌పై రూ.50 పెంచింది. సుమారు ఎనిమిది నెలలుగా నిలకడగా ఉన్న గ్యాస్ ధరను మళ్లీ పెంచి వినియోగదారులపై భారం మోపింది. నల్లగొండ జిల్లాలో మొత్తం 4,79,568 డొమెస్టిక్ గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రతి నెల 1,66,322 సిలిండర్ల వాడకం జరుగుతోంది. ఒక్కో సిలిండర్‌పై 50 రూపాయలు పెంచడంతో వినియోగదారులపై ప్రతి నెల రూ.83 లక్షలకు పైగా అదనపు భారం పడుతుంది. గ్యాస్ ధర పెంపుపై సామాన్య జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేడు, రేపు బీఆర్‌ఎస్ ఆందోళనలు

పెరిగిన వంట గ్యాస్ ధరలపై బీఆర్‌ఎస్ పార్టీ ఆందోళనలకు పిలుపునిచ్చింది. మంత్రి జగదీశ్‌రెడ్డి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజా ప్రతినిధులు, బీఆర్‌ఎస్ శ్రేణులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. గురువారం ఉదయం నియోజకవర్గ కేంద్రాల్లో, శుక్రవారం మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ ఆందోళనల్లో బీఆర్‌ఎస్ శ్రేణులతో పాటు మహిళలు అధికంగా పాల్గొనేలా చూడాలని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు.

ప్రాజెక్టుల పనులపై నిర్లక్ష్యం చేయొద్దు

- విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి
- మునుగోడు నియోజకవర్గ అభివృద్ధిపై రాజధానిలో సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, ఎమ్మెల్యేలు

మునుగోడు: సాగు నీటి వనరులు లేని మునుగోడులో నూతనంగా నిర్మిస్తున్న చెర్లగూడెం రిజర్వాయర్‌తో పాటు పలు ఫీడర్ చానల్‌ల పనులు పూర్తి చేయడంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేయొద్దని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో మునుగోడు నియోజకవర్గ అభివృద్ధిపై జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు, స్థానిక ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెర్లగూడెం, కిష్టరాయినిపల్లి భూ నిర్వాసితులకు ప్లాటు, పరిహారం అందించడంతో పాటు కాల్వల ఏర్పాటుకు భూ సేకరణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. అంతేకాకుండా వెల్మకన్నె, శేషిలేటివాగు ఫీడర్ చానల్స్, పెండలమ్మ చెరువు నిర్మాణంతో పాటు మునుగోడు మండలం సోలిపురం గ్రామ బిడ్జి, చౌటుప్పల్ మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో నకిరేకల్, తుంగతుర్తి ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, గాదరి కిశోర్, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ అజయ్‌కుమార్, ఈఈ రాములు, జిల్లా నీటిపారుదల శాఖ అధికారి ప్రభు తదితరులు పాల్గొన్నారు.



రథరంగ వైభవం

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి నిర్వహించిన దివ్య విమాన రథోత్సవం

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

- ఎస్పీ అపూర్వరావు



మాట్లాడుతున్న ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక ఆధారంగా మారుతాయని జిల్లా ఎస్పీ అపూర్వరావు అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సామాజిక భద్రతపై పారిశ్రామిక వేత్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ రహదారులు, ముఖ్య కూడళ్లు, ప్రజల రద్దీ ప్రాంతాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన సీసీ కెమెరాల ఏర్పాటుకు పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే సీసీ కెమెరా పుటేజీల ఆధారంగా జరిమానా విధిస్తామన్నారు. పరిమితికి మించి ఆటోల్లో బడిపిల్లలను తరలిస్తే కేసులు నమోదు చెస్తామని హెచ్చరించారు. జిల్లాలో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి, సీఐ రాఘవేందర్, ఆర్‌ఐ సంతోష్, పారిశ్రామిక వేత్తలు నాట్కో రాజకుమార్, సింగ్, సుధీర్ రెడ్డి, నవీన్‌రెడ్డి, మధుకర్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి.. ప్రజలను పలకరిస్తూ..

- కోదాడలో పర్యటించిన కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రే



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఠాక్రే, ఉత్తమ్

కోదాడ: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రే.. ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సూర్యాపేట జిల్లా కోదాడలోని మాతానగర్‌లో బుధవారం రాత్రి భారీర్యాలీగా వెళ్లి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. రాహుల్‌గాంధీ జోడో యాత్ర సందేశాన్ని వారికి వివరించారు. కరపత్రాలను పంపిణీ చేసి పలువురితో ముచ్చటించారు. ఠాక్రే మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పని చేస్తుందన్నారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే పద్మావతి తదితరులు ఉన్నారు.

గిరిజనుల ద్రోహి మోదీ

గిరిజన ద్రోహిగా ప్రధాన మంత్రి మోదీ నిలిచారని, గిరిజన రిజర్వేషన్లు ఎత్తివేసేందుకు కుట్రలు చేస్తున్నారని ఆదివాసీ అధికార్ మంచ్ జాతీయ నాయకురాలు, మాజీ ఎంపీ బృందా కరత్ ఆరోపించారు. మిర్యాలగూడలో బుధవారం ప్రారంభమైన గిరిజన సంఘం రాష్ట్ర మహాసభల్లో ఆమె పాల్గొని మాట్లాడారు.

– మిర్యాలగూడ



సభలో అభివాదం చేస్తున్న బృందాకరత్, జూలకంటి రంగారెడ్డి, చెరుపల్లి సీతారాములు, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మల్లు లక్ష్మి తదితరులు

- వివరాలు 10లో

కుక్కల నియంత్రణపై దృష్టిపెట్టండి

- కోతులు, పందుల బెడదను నివారించాలి
- తాగునీటి సమస్య పరిష్కరించాలి
- ఖాళీ స్థలాల్లో కంపచెట్లను తొలగింపజేయాలి
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో విన్నవించిన మిర్యాలగూడ పట్టణ ప్రజలు
- అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్న మున్సిపల్ కమిషనర్ రవీందర్‌సాగర్



ఫోన్ ఇన్‌లో ప్రజల సమస్యలు వింటున్న కమిషనర్ పోతుల రవీందర్‌సాగర్

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో గల కాలనీల్లో నెలకొన్న కుక్కలు, కోతులు, పందులు, దోమల బెడదను నివారించాలని పట్టణ ప్రజలు వేడుకున్నారు. మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్ పోతుల రవీందర్‌సాగర్‌తో బుధవారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను తెలియజేశారు. ప్రధానంగా కుక్కలు, కోతులు, డ్రెయినేజీ, మంచినీటి సరఫరా, ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిల్వ, పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించాలని పలువురు కోరారు. ప్రజల సమస్యలను ఫోన్ ద్వారా సావధానంగా విన్న కమిషనర్ అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సమస్యలు.. సమాధానాలు

ప్రశ్న : డ్రెయినేజీల్లో పూడిక సరిగా తీయకపోవడంతో దుర్వాసన వస్తోంది. వెంటనే సమస్యను పరిష్కరించాలి.

– రామయ్య, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, 9వ వార్డు

కమిషనర్ : శానిటరీ ఇన్‌స్పెక్టర్ దృష్టికి తీసుకెళ్లి డ్రెయినేజీలు శుభ్రం చేయిస్తాం.

ప్రశ్న : మా వార్డులో పందుల స్వైరవిహారంతో ఇబ్బందులు పడుతున్నాం.

– మల్లయ్య, వడ్డెరగూడెం, 7వ వార్డు

కమిషనర్ : సంబంధిత వార్డు కౌన్సిలర్‌తో మాట్లాడి యుద్ధ ప్రాతిపదికన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : కాలనీలో ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరగడంతో విషపు పురుగులు వస్తున్నాయి

– లక్ష్మయ్య, పరమేష్, 22వ వార్డు

కమిషనర్ : ఖాళీ స్థలాల యజమానులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. మరోసారి సారి నోటీసులను జారీ చేసి ప్లాట్లను శుభ్రం చేయిస్తాం.

ప్రశ్న : మ్యాన్ హోల్స్ మూతలు లేకుండా ప్రమాదకరంగా ఉన్నాయి. వాటిపై మూతలు వేయించాలి.

– రామకృష్ణ, ఎన్‌ఎస్‌పీ క్యాంపు

కమిషనర్ : యూజీడీ నిర్మాణంలో భాగంగా వేసిన మ్యాన్ హోల్స్‌పై చాలా ప్రాంతాల్లో మూతలు లేవని తెలిసింది. వెంటనే వాటిపై మూతలు వేయిస్తాం.

ప్రశ్న : రెడ్డి కాలనీలో కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం. వాటిని నియంత్రించాలి

– అనిత, కిరణ్, అశోక్, రాము, 20వ వార్డు

కమిషనర్ : కోతుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం.

ప్రశ్న : హౌజింగ్ బోర్డు, శాంతినగర్, రాంనగర్ తడకమళ్ల రోడ్డులో నెలకొన్న కుక్కల బెడదను నియంత్రించాలి

– పసుపులేటి రాజు హౌజింగ్‌బోర్డు, 5వ వార్డు, ఎండీ.గౌస్, శాంతినగర్, వెంకట సుధాకర్, రాంనగర్

కమిషనర్ : సాధ్యమైనంత వరకు కుక్కలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : హౌజింగ్ బోర్డులో, వడ్డెరగూడెంలోని శ్మశానవాటిక సమీపంలో మంచినీటి సమస్యను పరిష్కరించాలి.

– పాలిశెట్టి సత్యనారాయణ, సలీమా, శ్రీజ, వెంకట్‌రెడ్డి, లక్ష్మణ్, ఇందిర, హౌజింగ్ బోర్డు, ఎస్‌కె మునీర్, 7వ వార్డు, వడ్డెరగూడెం

కమిషనర్ : సంబంధిత ఏఈకి సమాచారం అందించి రెండు రోజుల్లో మిషన్ భగీరథ నీరు అందేలా చూస్తాం.

ప్రశ్న : చెట్లను నరికి కొమ్మలు తెచ్చి ఎన్‌ఎస్‌పీ క్యాంపులో పడవేశారు. వివిధ వ్యర్థాలను కూడా వేస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నాం.

– చేగొండి అచ్చాలు, ఎన్‌ఎస్‌పీ క్యాంపు

కమిషనర్ :ఈ విషయంపై పారిశుద్ధ్య సిబ్బందికి చెప్పి సమస్యను పరిష్కరిస్తాం.

ప్రశ్న : మా ప్రాంతంలో మురుగునీరు నిల్వ ఉంటుండడంతో దోమలతో వేగలేకపోతున్నాం.

– వెంకటేశ్వర్లు, కృష్ణ మానస కాలనీ

కమిషనర్ : దోమల బెడదను నియంత్రించేందుకు ఫాంగింగ్ చర్యలు చేపడతాం.

ప్రశ్న : చర్చి రోడ్డులో కెఎల్‌ఎన్ కళాశాల వద్ద స్పీడ్ బ్రేకర్‌ను ఏర్పాటు చేయాలి.

– విక్రం విద్యార్థి, చర్చి రోడ్డు

కమిషనర్ : పరిస్థితిని పరిశీలించిన తరువాత అవసరమైతే స్పీడ్ బ్రేకర్‌లను ఏర్పాటు చేయిస్తాం.

ప్రశ్న : డాక్టర్ కాలనీలో రోడ్లపైనే సిరంజ్‌లతో పాటు ఆస్పత్రి వ్యర్థాలు వేస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నాం.

– శేఖర్, లక్ష్మణ్, వహీద్ డాక్టర్స్ కాలనీ

కమిషనర్ : డాక్టర్స్ కాలనీలో ఆస్పత్రుల వ్యర్థాలు రోడ్లపై వేయకుండా నోటీసులు జారీ చేస్తాం.

ప్రశ్న : చెత్త సేకరణకు సరిగా వాహనాలు రావడం లేదు.

– లక్ష్మి, బాపూజీనగర్

కమిషనర్ : ప్రతి గల్లీకి చెత్త వాహనాలు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : శాంతినికేతన్ కళాశాల వైపు డ్రెయినేజీలు లేక ఇబ్బందులు పడుతున్నాం.

– రాజు, 18వ వార్డు

కమిషనర్ : ఈ సమస్యపై రాత పూర్వకంగా రాసిస్తే సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కారం చేస్తాం.

ప్రశ్న : సాగర్ రోడ్డులో తోపుడు బండ్లతో పాటు రోడ్లపైనే ఆటోలు ఎక్కడపడితే అక్కడ నిలుస్తుండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడి ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

– ప్రసాద్, రాంనాయక్, భారత్, సాగర్ రోడ్డు

కమిషనర్ : సాగర్ రోడ్డులో తోపుడు బండ్లు రోడ్లపై కాకుండా లోపలికి పెట్టుకునే విధంగా చూస్తాం. ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా పోలీస్ శాఖ వారి దృష్టికి సమస్యను తీసుకెళ్తాం.

క్లుప్తంగా

'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

చివ్వెంల(సూర్యాపేట) : పదో తరగతిలో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ సీతారామ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గిరిజన బాలికల హాస్టల్‌ను సందర్శించి మాట్లాడారు. క్రమశిక్షణ పట్టుదలతో చదివి భావిపౌరులుగా ఎదగాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని వార్డెన్‌ను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో వార్డెన్, హెచ్‌ఎం పాల్గొన్నారు.

సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

కోదాడఅర్బన్ : వసతి గృహాల్లో ప్రభుత్వ కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ సీతారామ్ అన్నారు. బుధవారం కోదాడ పరిధిలోని బాలాజీనగర్‌లో ఉన్న గిరిజన బాలికల వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. కార్యక్రమంలో వసత గృహ సంక్షేమాధికారి వంగపల్లి పద్మ, పాఠశాల సిబ్బంది సుజాత పాల్గొన్నారు.

ఒకరి దుర్మరణం

రామగిరి(నల్లగొండ) : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన తిప్పర్తి మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కేతేపల్లి మండలం కోర్లపహాడ్‌కు చెందిన సూరారపు కృష్ణయ్య (48) బుధవారం బొల్లేపల్లిలో బంధువు అంత్యక్రియలకు హాజరయ్యారు. అనంతరం రాత్రి మరో వ్యక్తితో కలిసి బైక్‌పై ఇంటికి తిరిగి వెళ్తున్న క్రమంలో చిన్నసూరారం సమీపంలో నిలిచి ఉన్న డీసీఎంను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కృష్ణయ్య అక్కడికక్కడే మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

రామగిరి(నల్లగొండ) : చెరువులో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన తిప్పర్తి మండలంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడకు చెందిన చిలుమల రాజేష్(40)కు వెంకటాద్రిపాలెం పల్లె నాగయ్య కుమార్తె మౌనికతో 8 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. భార్య పిల్లలతో కలిసి మిర్యాలగూడలో హమాలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రాజేష్‌కు కొన్ని రోజులుగా మానసికంగా స్థితి సరిగా లేకపోవడంతో రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులు వెంకటాద్రిపాలెం వచ్చారు. మంగళవారం రాత్రి రాజేష్ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లాడు. కుటుంబ సభ్యులు రోజంతా వెతికారు. సాయంత్రం పజ్జూరు చెరువులో శవమై తెలియాడుతుండగా స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

శ్రీమహావిష్ణువుగా దర్శనమిచ్చి..


స్వామివారి సేవలో పాల్గొన్న ఈఓ గీతారెడ్డి


రథాంగ హోమం నిర్వహిస్తున్న ఆచార్యులు

- గరుడ వాహనంపై ఊరేగిన నృసింహుడు
- యాదాద్రిలో కనుల పండువగా దివ్య విమాన రథోత్సవం
- తిరుమాఢ వీధుల్లో విహరించిన కల్యాణ మూర్తులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆచార్యులు, పారాయణీకులు, రుత్వికుల పఠనాలతో ఆలయమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. మంగళవారం రాత్రి శ్రీలక్ష్మీదేవిని శ్రీనృసింహస్వామి వారు పరియణమాడగా.. బుధవారం ఉదయం స్వామి వారు శ్రీమహా విష్ణు అలంకారములో గరుడవాహనంపై ఊరేగి.. రాత్రి దివ్య విమాన రథోత్సవంపై ఆలయ మాఢ వీధుల్లో విహరించారు.

ఉదయం నుంచే..

ఆలయంలో నిత్యారాధనలు నిర్వహించిన అనంతరం స్వామివారిని గరుడవాహనంపై శ్రీ మహా విష్ణు అలంకార సేవలో మాఢ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ పడమటి రాజగోపురం ముందు గల వేంచేపు మండపంలో అధిష్టింపజేశారు. స్వామివారికి వేద పారాయణం చేసిన అనంతరం, అలంకార విశిష్టతను ప్రధానార్చకులు వివరించారు. ఆయా వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఈఓ గీతారెడ్డి, ప్రధానార్చకులు, అర్చకులు, పారాయణీకులు, రుత్వికులు, ఆచార్యులు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్య విమాన రథంపై..

ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం స్వామి వారి ఆలయంలో నిత్యారాధనలు జరిపించారు. అనంతరం చతుస్థానార్చనలు, మండపారాధనలు, మూలమంత్ర జపములు, ద్వార తోరణ పూజలు, దివ్య ప్రబంధ పారాయణాలు, మహామంత్ర పుష్ప పఠనాదులు, పురాణ, ఇతిహాస, విజ్ఞాపనలు నిర్వహించారు. అనంతరం రథాంగ హోమం, రథబలి, ఉత్సవ మూర్తుల అలంకార సేవ ఊరేగింపు గావించారు. రాత్రి వేళ స్వామివారిని ఆలయ మాఢ వీధుల్లో దివ్య విమాన రథోత్సవంపై ఊరేగించారు. భక్తుల జయ నారసింహ అంటూ నినాదాలు, బ్యాండ్ మేళాలు, భజంత్రీల చప్పుళ్ల నడుమ, బాణసంచాల వెలుగుల్లో వైభవోపేతంగా స్వామి వారి రథోత్సవ వేడుక సాగింది. దివ్య విమాన రథోత్సవానికి ముందు ఆలయ మాఢ వీధుల్లో స్థానిక యువకులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కేరింతలు, నృత్యాలతో సందడి చేశారు. కొండపైన రథోత్సవం సమయంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఏసీపీ సైదులు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ఉత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 10.30గంటలకు మహా పూర్ణాహుతి, చక్రతీర్థం, సాయంత్రం గంటలకు శ్రీపుష్ప యాగం, దేవతోద్వాసన, దోపోత్సవాలను జరిపిస్తారు.


స్వామివారికి హారతినిస్తున్న ప్రధానాచార్యులు


పారాయణం చేస్తున్న అర్చకులు


నృత్యం చేస్తున్న కళాకారులు

కొనసాగుతున్న ధార్మిక మహాసభలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ధార్మిక, సంగీత, సాహిత్య మహాసభలు కొనసాగుతున్నాయి. శ్రీవైష్ణవ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రభాతభేరీ, యాదగిరిగుట్టకు చెందిన మిర్యాల లక్ష్మీబృందం, హైదరాబాద్ శబరిగిరీశ అయ్యప్ప భక్త బృందంచే భజన కార్యక్రమం చేపట్టారు. ఆస్థానం వారిచే మంగళవాయిద్యం, వైదిక ప్రార్థనలు నిర్వహించారు. భాస్కరబట్ల ఆంజనేయశర్మ శ్రీమత్ భాగవతాంతర్గతమైన గజేంద్రమోక్షం అనే అంశంపై ఉపన్యాసం గావించారు. పాల రామాంజనేయ భాగవతార్ సీతాకల్యాణం అను హరికథను గానం చేశారు. యాదాద్రి భజన సేవా సమితి ఆధ్వర్యంలో భజన నిర్వహించారు. సంగీత సిస్టర్స్‌చే, జీవిఆర్ మ్యూజిక్ ఇనిస్టిట్యూట్ వారిచే భక్తి సంగీతం, డి.వి మోహనకృష్ణచే కర్ణాటక సంగీతం నిర్వహించారు. సాయంత్రం పలువురు కళాకారులు నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. గడ్డం అంజయ్యచే చిందు యక్షగానం నిర్వహించారు. రథం ముందు శాపెల్లి వారిచే చెక్క భజన, శాలిగౌరారం వారిచే చిరుతల భజన, గడ్డం పాండు బృందంచే కోలాటం నిర్వహించారు.


సంగీత కచేరీ చేస్తున్న జీవీఆర్ మ్యూజిక్ అకాడమీ కళాకారులు

స్వామివారిని దర్శించుకున్న మంత్రి ఎర్రబెల్లి


అష్టోత్తర పూజలో పాల్గొన్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని బుధవారం సాయంత్రం పంచాయత్ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆచార్యులు మంత్రికి సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ముఖ మండపంలోని ఉత్సవ మూర్తుల చెంత అష్టోత్తరం, సువర్ణ పుష్పార్చన వంటి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం మంత్రికి ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు. కాగా ఉదయం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి స్వామిని దర్శించుకొని పూజలు చేశారు.

పిల్లల దత్తతకు దరఖాస్తు చేసుకోవాలి

భువనగిరిటౌన్ : పిల్లలు లేని దంపతులు దత్తత తీసుకోవడానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. బుధవారం తమిళనాడుకు చెందిన ముత్తుకరుప్పాన్, శీగప్తి సుబ్రమాన్యాన్ దపతులకు జిల్లా శిశు గృహకు చెందిన ఐదు సంవత్సరాల పాప ప్రతీకను దత్తత ఇచ్చినట్లు తెలిపారు. సీఏఆర్‌ఏ వెబ్‌సైట్ సందర్శించి కావాల్సిన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకుంటే దత్తత ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో బాలల పరిరక్షణ అధికారి పులుగుజ్జ సైదులు ఉన్నారు.


బాలికను అందజేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

బహుజనులకు అధికారం దక్కాలి

- డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్

భూదాన్‌పోచంపల్లి : బహుజనులకు రాజ్యాధికారం దక్కాలని దళితశక్తి ప్రోగ్రామ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ అన్నారు. విశారదన్ చేపట్టిన 10వేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర బుధవారం మండలంలోని జూలూరు, ముక్తాపూర్, రేవనపల్లి గ్రామాల మీదుగా రాత్రి పోచంపల్లికి చేరుకొంది. వీరికి ఆయా గ్రామాల్లో దళిత సంఘాల నేతలు ఘనంగా స్వాగతం పలికారు. పట్టణ కేంద్రంలోని కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓట్లను అమ్ముకొని బానిసలుగా ఉందామా మన ఓట్లు మనం వేసుకొని పాలకులవుదామని ప్రశ్నించారు. అసెంబ్లీలో ఇప్పటివరకు పద్మశాలి, చాకలి, మంగళి సామాజిక వర్గాలనుంచి ఎమ్మెల్యే కాలేకపోవడం దురదుష్టకరమని అన్నారు. తెలంగాణలో రెడ్ల, వెలమదొరల రాజ్యాన్ని దింపి అణగారిన వర్గాలకు అధికారంలోకి తీసుకరావడమే ఈ పాదయాత్ర ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఎస్సీ, ఎస్టీ, బీసీ అణగారిన వర్గాలు ఏకమై రాజ్యాధికారం సాధించుకోవాలని పిలుపునిచ్చారు. అంతకుముందు డీఎస్పీ జెండా, శిలాఫలకాన్ని ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో పాదయాత్ర ఇంచార్జ్ లక్ష్మణ్, డీఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు నరేందర్, బహుజన శక్తి రాష్ట్ర కన్వీనర్ నల్ల లక్ష్మణ్, ు చింతకింది రమేశ్, వెంకటేశ్, కొమ్ము లక్ష్మన్, నర్సింగ్, గాలయ్య, సంజీవ్, నర్సింహ, సాయికిరణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ విశారదన్ మహారాజ్

నేరస్తులపై కఠినంగా వ్యవహరించాలి

- ప్రభుత్వ భూములు ఆక్రమిసే పీడీ యాక్టు నమోదు చేయాలి
- పోలీస్ సిబ్బందికి రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ ఆదేశం

సాక్షి, యాదాద్రి : వృద్ధులు, మహిళలపై దాడులకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని రాచకొండ పోలీస్ కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్ సిబ్బందిని ఆదేశించారు. అదే విధంగా ఎవరైనా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే పీడీ యాక్టు నమోదు చేయాలన్నారు. భువనగిరి జోన్ పోలీస్ అధికారులతో బుధవారం నిర్వహించిన క్రైమ్ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా నేర నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. ఫిర్యాదు చేయడానికి పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలన్నారు. వారి బాధలను ఓపికగా విని సత్వర న్యాయం చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో అవసరమైన మేరకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు తక్షణమే స్పందించి న్యాయం చేకూర్చాలన్నారు. భూ కబ్జాదారులు, హైవే దిగ్బంధం చేసే వారిని ఉపేక్షించవద్దని చెప్పారు. యాదాద్రి భువనగిరి జోన్‌లోని ఆయా స్టేషన్ల అధికారుల పనితీరు గురించి తెలుసుకున్నారు.

భక్తులకు సీపీ ధన్యవాదాలు

యాదాద్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా పోలీస్ శాఖకు సహకరించిన భక్తులకు సీపీ ధన్యవాదాలు తెలిపారు. ఉత్సవాల ముగింపు సమయంలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందని, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో యాదాద్రి భువనగిరి డీసీపీ రాజేశ్ చంద్ర, ఏసీపీలు వెంకట్‌రెడ్డి, నర్సింహారెడ్డి, సైదులు, ఉదయ్‌రెడ్డి, భువనగిరి జోన్ సీఐ, ఎస్‌హెచ్‌ఓ, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.


పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న రాచకొండ సీపీ దేవేంద్రసింగ్ చౌహాన్

మూడు కిలోల గంజాయి పట్టివేత

- ఐదుగురు యువకుల అరెస్ట్

నల్లగొండ క్రైం : నీలగిరి పట్టణంలోని ఓ ఇంటిపై పోలీసులు దాడి చేసి మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఐదుగురు యువకులను అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శాలిగౌరారం మండలం ఊట్కూర్ గ్రామానికి చెందిన బోట్ల విశ్వంత్, జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్‌కు చెందిన విశ్వనాదుల ఈశ్వర్, కొక్కు రమేశ్, గాంధీనగర్‌కు చెందిన వాడపల్లి శివ, పానగల్‌కు చెందిన గీసుకొండ శివలు స్నేహితులు. వీరు కొంతకాలంగా హైదరాబాద్‌లో గంజాయిని కొనుగోలు చేసి తీసుకువచ్చి నలగొండలో విక్రయించడంతో పాటు సేవిస్తుంటారు. విద్యుత్‌నగర్‌లోని ఓ నివాసంలో ఈ ముఠా గంజాయిని విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. వారి వద్ద మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, అరెస్ట్ చేశారు. నిందితులను తహసీల్దార్ నాగార్జునరెడ్డి ఎదుట ప్రవేశపెట్టిన పంచనామా చేశారు. అనంతరం కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు టూటౌన్ సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న కానిస్టేబుళ్లు బాల కోటి, శంకర్, సత్యనారాయణలను వారు అభినందించారు.

పోలీస్ పహారాలో దుకాణాల తొలగింపు

ఆత్మకూర్-ఎస్(సూర్యాపేట): మండల పరిధిలోని నెమ్మికల్ దండ మైసమ్మ ఆలయం వద్ద రోడ్డు వెడల్పులో భాగంగా బుధవారం రోడ్డు వెంట ఉన్న షాపులు, అక్రమ కట్టడాలను పోలీస్ పహారాలో అధికారులు తొలగించారు. ఆలయం విస్తరించడం.. రోడ్డు పై ట్రాఫిక్ సమస్య పెరగడం కారణంగా ఇటీవల జిల్లా కలెక్టర్ వెంకట్రావ్ ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆర్ అండ్ బి రోడ్డుకు ఉన్న షాపులను, కట్టడాలను వెంటనే తొలగించి రోడ్డు విస్తరణ పనులను చేపట్టాలని ఆదేశించారు. బుధవారం ఆర్‌అండ్‌బి, రెవెన్యూ అధికారులు పోలీసుల బందోబస్తు నడుమ షాపులను జేసీబీలతో తొలగించారు. ఆర్ అండ్ బి రోడ్డు 100 ఫీట్ల వరకు విస్తరించి ఉందని, ఆక్రమించిన షాపులు మాత్రమే తొలగించామని ఆర్‌అండ్‌బి ఈఈ యాకూబ్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ హేమమాలిని, ఎంపీడీఓ మల్సూర్ నాయక్,, తుంగతుర్తి సీఐ నాగార్జున గౌడ్, ఎస్‌ఐ యాదవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మిషన్' నీరు వరదలా..

నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని ఎన్‌టీఆర్ నగర్ వద్ద మిషన్ భగీరథ పైపులైన్ బుధవారం పగిలిపోయింది. దీంతో నిరంతా జడ్జర్ల-కోదాడ ప్రధాన రహదారిపై వరదలా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు తెలియజేడంతో మిర్యాలగూడ మండలంలోని అవంతిపురంలోని మిషన్ భగీరథ హెడ్ రెగ్యులేటర్ వద్ద నీటిని నిలుపుదల చేశారు.

– నేరేడుచర్ల



టాటాఏస్ వాహనం బోల్తా... డ్రైవర్‌కు గాయాలు


అదుపు తప్పి బోల్తాకొట్టిన వాహనం

చివ్వెంల(సూర్యాపేట) : అతివేగంగా వస్తున్న వాహనం అదుపుతప్పి బోల్తాకొట్టడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం మండల పరిధిలోని బండమీది గ్రామ శివారులో సూర్యాపేట-ఖమ్మం రహదారిపై జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...పత్తిలోడుతో సూర్యాపేట నుంచి ఖమ్మం వెళ్తున్న టాటాఏస్ వాహనం మార్గమధ్యలో బి.చందుపట్ల వద్ద అదుపుతప్పి రోడ్డుపై బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ శేషగిరి కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్త సూర్యాపేటకు తరలించారు. కాగా, పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. వాహనాన్ని పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

జెండా దిమ్మె ఏర్పాటును అడ్డుకున్న పోలీసులు

- పోచంపల్లిలో దళిత సంఘాల నాయకులు, పోలీసులకు తీవ్ర వాగ్వాదం
- ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని నిరసన

భూదాన్‌పోచంపల్లి : జెండీ దిమ్మె ఏర్పాటుపై దళిత శక్తి ప్రోగ్రాం నాయకులు, పోలీసులకు తీవ్ర స్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ విశారదన్ స్వరాజ్య పాదయాత్ర బుధవారం పోచంపల్లికి వస్తున్న క్రమంలో దళితశక్తిప్రోగ్రామ్ జెండావిష్కరణ చేయడానికిగాను నిర్వాహకులు మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో దిమ్మె ఏర్పాటు చేస్తుండగా మున్సిపల్ అధికారులు తొలగించారు. చివరకు స్థానిక దళిత కౌన్సిలర్ పెద్దల చక్రపాణి జోక్యం చేసుకొని రాత్రి తిరిగి దిమ్మెను నిర్మిస్తున్న క్రమంలో సమాచారం అందుకొన్న ఎస్‌ఐ సైదిరెడ్డి అక్కడికి చేరుకొని అడ్డుకొన్నాడు. దాంతో ఎస్‌ఐ, కౌన్సిలర్‌కు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం కౌన్సిలర్‌ను పోలీసులు జీపులో ఎక్కిస్తున్న క్రమంలో తోపులాట జరిగి అతని చొక్కా చిరిగింది. దాంతో ఆగ్రహించిన కౌన్సిలర్, అతని మద్దతుదారులు పోలీసుల తీరును నిరసిస్తూ అర్ధరాత్రి స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో సమాచారం అందుకొన్న చౌటుప్పల్ ఏసీపీ ఉదయ్‌రెడ్డి, రూరల్‌సీఐ మహేశ్, వెంటనే సంఘటన స్థలానికి చేరుకొన్నారు. రాత్రి పూట ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఎస్‌ఐను సస్పెండ్ చేయాలని వినతి..

పెద్దల చక్రపాణి దళిత ప్రజాప్రతినిధినైన తనపై దాడి చేసిన ఎస్‌ఐను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ చౌటుప్పల్ ఏసీపీ ఉదయ్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. దుర్భాషలాడిన ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఏసీపీ స్పందిస్తూ ప్రభుత్వ అనుమతి లేకుండా విగ్రహాలు, దిమ్మెలు ఏర్పాటు చేయొద్దన్నారు. ఘటనపై విచారణ జరిపిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.


చౌటుప్పల్ ఏసీపీ ఉదయ్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్ పెద్దల చక్రపాణి

మందుల పిచికారీలో జాగ్రత్తలు పాటించాలి

పాడి పంట

నడిగూడెం: ప్రస్తుత సీజన్‌లో వరిలో చీడపీడల సమస్య అధికంగా ఉంది. దీంతో రైతులు వివిధ రకాల పురుగులు, తెగుళ్లను నివారించేందుకు క్రిమిసంహారక మందులు చల్లుతున్నారు. పంట కాలంలో నాలుగు నుంచి ఆరుసార్లు రసాయన మందులను పిచికారీ చేస్తున్నారు. అయితే పురుగు మందులను వాడే విధానం తెలియకపోవడం, కనీస జాగ్రత్తలు పాటించకపోవడంతో పలువురు రైతులు అస్వస్థతకు గురై ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. మిరప, వరి, పత్తి పంటలకు తెగుళ్ల తీవ్రతను బట్టి ప్రమాదకరమైన రసాయన మందులను వాడుతున్నారు. మందులు కలిపే సమయంలో ఎటువంటి గ్లౌజులు ఉపయోగించకుండా చేతులు, కర్రలను ఉపయోగిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో 14 ఏళ్ల లోపు పిల్లలు కూడా పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. మందులు పిచికారీ చేసిన తర్వాత భోజనం చేయడం, నీళ్లు తాగడం, పొగ తాగడం సాధారణంగా మారింది. ఆ మందు డబ్బాలను ఇళ్లల్లో నిత్యకృత్యాలకు వాడుకుంటున్నారు. పురుగు మందుల పిచికారీలో రైతులు పాటించాల్సిన జాగ్రత్తలు నడిగూడెం మండల వ్యవసాయాధికారి ఎం. రాజగోపాలరావు మాటల్లోనే..


పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

- పురుగు మందులు పిచికారీ చేసే ముందు తప్పనిసరిగా ముక్కు, కళ్లకు మందు తాకకుండా హెల్మెట్ వంటిది ధరించాలి.
- మందును ట్యాంకుల్లో కలుపుకునే సమయంలో చేతులకు తప్పనిసరిగా గ్లౌజులు ఉపయోగించాలి.
- పిచికారీ సమయంలో నీళ్లు తాగడం, సిగరెట్ వంటివి తాగడం చేయరాదు.
- పిచికారీ పూర్తయ్యి స్నానం చేసిన తర్వాతే ఆహారం తీసుకోవాలి.
- పురుగు మందులను గాలి వీచే వ్యతిరేక దిశలో పిచికారీ చేయరాదు.
- సాధ్యమైనంత వరకు గాలి, ఎండ ఉన్న సమయంలోనే మందులు పిచికారీ చేయడం మంచిది.
- కొన్ని రకాల రసాయన మందులు రెండు మూడు కలిపి పిచికారీ చేస్తుంటారు. ఇది చాలా ప్రమాదకరం.
- రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలి.
- రైతులు పూర్తిస్థాయి దుస్తులు ధరించి పురుగు మందులు పిచికారీ చేయడం ఉత్తమం.